తోపులాటలు.. కేకలు



దేవరకద్రలోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం పోటెత్తిన రైతులు

- తీవ్రస్థాయికి చేరిన యూరియా కష్టాలు
- టోకెన్ల కోసం తప్పని అవస్థలు
- దేవరకద్ర పీఏసీఎస్ వద్ద మహిళల తోపులాట
- ఓ మహిళకు తెగిన చెవికమ్మ భాగం
- ఆస్పత్రికి తరలింపు

దేవరకద్ర/భూత్పూర్/చిన్నచింతకుంట: యూరియా కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. ఎరువుల విక్రయ కేంద్రాలతో పాటు ముందస్తుగా టోకెన్లు జారీ చేసే ప్రాంతాల్లో రైతుల తోపులాటలు, అరుపుల కేకలు దద్దరిల్లుతున్నాయి. రైతుల మధ్య గొడవ చోటు చేసుకొని ఘర్షణకు దారితీస్తోంది. గురువారం దేవరకద్రలోని మన గ్రోమోర్ కేంద్రానికి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. దాదాపు వెయ్యి మందికి పైగా రైతులు తెల్లవారుజామున 4 గంటలకే వచ్చి బారులు తీరారు. ఓవైపు పురుషులు, మరోవైపు మహిళా రైతులు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. ఇక పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను క్యూలో నిలబెట్టారు. ఉదయం 9గంటల తర్వాత కేంద్రాన్ని తెరిచి యూరియా పంపిణీని ప్రారంభించారు. ఈ క్రమంలోనే టోకెన్లు లేని రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. పీఏసీఎస్ వద్ద టోకెన్లు జారీ చేస్తామని అధికారులు చెప్పడంతో అక్కడికి పరుగులు తీశారు. ఏఓ రాజేందర్ అగర్వాల్, ఎస్ఐ నాగన్న రైతులందరినీ పీఏసీఎస్ వద్ద కూర్చోబెట్టారు. ఎస్ఐ స్వయంగా టోకెన్లు ఇస్తుండగా.. మహిళలు ఒకరినొకరు తోసుకుంటూ టోకెన్ల కోసం ఎగబడ్డారు. ఈ క్రమంలో నార్లోనికుంటకు చెందిన సత్యమ్మ, డోకూర్‌కు చెందిన బాలకిష్టమ్మ ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో సత్యమ్మ చెవికి ఉన్న కమ్మ ఊడిపోయి చెవి భాగం తెగి రక్తగాయమైంది. ఇక బాలకిష్టమ్మ కింద కూలబడింది. ఇలా చాలా మంది మహిళలు అటు, ఇటు కింద మీద పడ్డారు. వెంటనే పోలీసులు వారిని అదుపుచేసి.. గాయపడిన సత్యమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం 1800 మందికి టోకెన్లు జారీ చేశారు. మన గ్రోమోర్ కేంద్రం వద్ద 1200 మందికి యూరియా పంపిణీ చేశారు.శనివారం యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు.



రోదిస్తున్న మహిళా రైతు డోకూర్ బాలకిష్టమ్మ

■ భూత్పూర్‌లో ఎక్కడ టోకెన్లు ఇస్తున్నారో.. ఎక్కడ యూరియా పంపిణీ చేస్తున్నారో తెలియక రైతులు అయోమయానికి గురయ్యారు. ఫర్టిలైజర్ దుకాణాల వద్ద తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు. చివరకు మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారని తెలుసుకొని అక్కడ బారులు తీరారు.

■ చిన్నచింతకుంటలోని ఆగ్రో రైతు సేవాకేంద్రం, మన గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. మన గ్రోమోర్‌లో 450, ఆగ్రో రైతు సేవాకేంద్రంలో 270 బస్తాల యూరియాను అధికారులు పోలీసు బందోబస్తు మధ్య రైతులకు పంపిణీ చేశారు.



భూత్పూర్‌లోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు



చిన్నచింతకుంటలో ఇలా..

అభివృద్ధి పనుల్లో అందరి భాగస్వామ్యం



మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/పాలమూరు/స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ముడా నిధులతో స్థానిక వీరన్నపేటలోని నీలకంఠస్వామి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్, వీరభద్ర కాలనీలో యాదవ కమ్యూనిటీ హాల్, మోతినగర్‌లోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నిర్మించే షెడ్, ప్రహరీకి, బోయపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే బోయపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెట్టుగడ్డలోని గిరిజన భవన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మట్టి గణనాథుడికి ఎమ్మెల్యే యెన్నం ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా వీరన్నపేటలో కాంగ్రెస్ పార్టీ వార్డు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది

కష్టానికి తగిన ప్రతిఫలం తప్పక దక్కుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక శిల్పారామంలో సుమారు 400 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, యూనిఫాంలను కలెక్టర్ విజయేందిరతో కలిసి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.పి.వెంకటేష్, ఎస్.వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, సీజే బెన్‌హర్, అజ్మత్‌అలీ, ఖాజాపాషా, నాగరాజు, శ్రీకాంత్, రాజు, సత్యం, దండోరా నర్సింలు, బ్యాగరి వెంకటస్వామి, అబ్దుల్‌హక్, మాజీ కౌన్సిలర్లు గోపాల్‌యాదవ్, శాంతన్నయాదవ్, ఎ.అంజయ్య, జాజిమొగ్గ నర్సింహులు, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ముడా నిధులు రూ. 35లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యెన్నం శంకుస్థాపన చేశారు. అనంతరం న్యాయవాదులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది ప్రతాప్‌కుమార్ విద్యానిధి కోసం రూ. 5లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కోశాధికారి వెంకట్‌రావు పాల్గొన్నారు.

■ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇచ్చి 20శాతం సీట్లు కేటాయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు సల్మాన్, ముస్తాక్‌అలీ, సూఫియాన్ అహ్మద్, రహీం, ఉపాధ్యక్షుడు నవాజ్, సమీర్ హుస్సేన్, సమీర్, హకీం పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని.. ఇక భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హన్వాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులు పొలం, ఇళ్లను విడిచి యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ పెంటయ్య, మాజీ ఉపసర్పంచ్ రంగాపురి, వెంకటయ్య, లక్ష్మయ్య, గోవర్ధన్‌గౌడ్, చెన్నయ్య ఉన్నారు.

నియామకం



మెట్టుగడ్డ/జడ్చర్ల టౌన్: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా రమేశ్ ఆచారి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్, అధ్యక్షుడు పుష్పగిరి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగిరి మాట్లాడుతూ.. విశ్వకర్మలు రాజ్యాధికారం సాధించేందుకు గ్రామస్థాయి నుంచి బలోపేతం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా కన్వీనర్లను నియమించినట్లు పేర్కొన్నారు. విశ్వకర్మల చైతన్యం కోసం ఈ నెల 17నుంచి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

■ విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ జడ్చర్ల నియోజకవర్గ యూత్ వింగ్ కన్వీనర్‌గా దేవోజు మహేశ్‌చారిని నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించిన విశ్వనాథుల పుష్పగిరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలిండియా బ్యాడ్మింటన్ టోర్నీకి జిల్లా ఉద్యోగులు



మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ సివిల్ సర్వీసెస్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు ఉద్యోగులు ఎంపికయ్యారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఎంపికల్లో ఓపెన్ విభాగంలో కె.భానుప్రకాశ్, ఎన్.వెంకటప్ప, 45ఏళ్ల విభాగంలో బాల్‌రాజు, 55 ఏళ్ల విభాగంలో సుభాష్ పాల్గొని ఆలిండియా సివిల్ సర్వీసెస్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు.

ఏరియా ఆస్పత్రిలో వాటర్‌ట్యాంక్ నిర్మాణం

జడ్చర్ల టౌన్: ఏరియా ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ. 19లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ట్యాంక్ నిర్మించనున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్ తెలిపారు. వాటర్‌ట్యాంకు నిర్మాణ విషయమై గురువారం స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద సంబంధిత అధికారులతో సమీక్షించారు. త్వరితగతిన ట్యాంక్ నిర్మాణం చేపట్టి.. ఆస్పత్రికి భగీరథ నీటిని సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఏరియా ఆస్పత్రి ఆవరణలో ట్యాంక్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. కాగా, ఆస్పత్రిలో విర్కో సహకారంతో మహావీర్ ట్రస్టు నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌లో నీటి సమస్య నెలకొంది. అయితే నీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకు నిర్మించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ట్యాంకు నిర్మాణం కోసం టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలోనే పనులు మొదలుపెడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీశ్, ఏఈ మొగులాల్, సిబ్బంది యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.



పీయూ బాలికల హాస్టల్ తనిఖీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలోని బాలికల హాస్టల్‌ను గురువారం వీసీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌కు వచ్చిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. వసతుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. హాస్టల్‌లో క్రమశిక్షణతో మెలగాలన్నారు. బాలికల్లో రక్తహీనత సమస్యను నివారించేందుకు పోషకాలు కలిగిన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, చీఫ్ వార్డెన్ కృష్ణయ్య, వార్డెన్ సబిత, లక్ష్మి, నాగసుధ, కేర్ టేకర్స్ శివరాణి, రేణుక పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లకు వీడ్కోలు



భూత్పూర్: మున్సిపాలిటీ నుంచి బదిలీ అయిన వార్డు ఆఫీసర్లకు గురువారం ఘన వీడ్కోలు పలికారు. వార్డు ఆఫీసర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, కుర్మయ్యతో పాటు 8మంది జీపీఓలుగా నియమితులై బదిలీ అయ్యారు. వీరిని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మ తదితరులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



జడ్చర్ల టౌన్: ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్–3, వృక్షశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఒక నిమిషం మౌనం పాటించి అమరవీరులకు నివాళులర్పించారు. వారు చేసిన సాహసోపేతమైన సేవలను కొనియాడారు. అనంతరం వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.నర్మద, వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య మాట్లాడుతూ.. చెట్ల నరికివేతను అరికట్టడం, వన్యప్రాణులను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. కాగా, పీజీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.లత, హెర్బేరియం కీపర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

అడ్డాకుల: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లిలో గురువారం ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాలలను పనిలోకి తీసుకెళ్లకుండా చదివించాలని సూచించారు. కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి బాసిత్, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి నవీన్, సిబ్బంది బషీర్, అంజద్, సురేందర్, కురుమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

కేజీబీవీ, హాస్టళ్లలో మెనూ తప్పనిసరి

నవాబుపేట/మిడ్జిల్: కేజీబీవీ, హాస్టళ్లలో మెనూ తప్పనిసరిగా పాటించాలని నవాబుపేట మండల ప్రత్యేకాధికారిణి సునీత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల అధికారులతో కలిసి ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, ఎస్ఓ మాధవి పాల్గొన్నారు.

■ మిడ్జిల్ కేజీబీవీతో పాటు బీసీ హాస్టల్‌ను ఎంపీడీఓ గీతాంజలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనంతో పాటు కూరగాయలు, బియ్యం, ఇతర వంట సామగ్రి నాణ్యతను పరిశీలించారు.



నవాబుపేట కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారిణి సునీత

భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

నవాబుపేట: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. రేషన్‌కార్డులు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.

■ ప్రభుత్వం కొత్తగా నియమించిన గ్రామ పాలన అధికారులు గురువారం విధుల్లో చేరారు. మండలంలోని రెవెన్యూ గ్రామాలను 11 క్లస్టర్లుగా విభజించగా.. 11మంది జీపీఓలు ఆయా క్లస్టర్లలో చేరినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, ఆర్ఐ గాయత్రి పాల్గొన్నారు.



మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి

హిందీ భాషపై పట్టు సాధించాలి

జడ్చర్ల టౌన్: దేశాన్ని ఏకతాటిపై నిలబెట్టే శక్తి హిందీ భాషకు ఉందని ఎంఈఓ మంజులాదేవి అభిప్రాయపడ్డారు. మండలంలోని కోడ్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఉపాధ్యాయులు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ హిందీ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి హిందీ ఒక వంతెనలా పనిచేస్తోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాష ప్రతిష్ట రోజురోజుకు పెరుగుతుందన్నారు. విద్యార్థులు హిందీ భాషలో పట్టు సాధించాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో హిందీ ప్రాముఖ్యత అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మారేపల్లి శ్రీనివాసులు, అనంతప్ప, ఎస్‌టీయూ నాయకులు తాహేర్, సురేంద్రనాథ్, శ్రీనివాసులు, హనుమాన్‌సింగ్, అబ్దుల్లా, బసవయ్య, రాఘువేందర్, మంజుల, అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

బెల్టుషాపులపై దాడులు

జడ్చర్ల: స్థానిక పాతబజార్‌లోని బెల్టుషాపులపై గురువారం ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. 5 బెల్టుషాపుల్లో 24.7 లీటర్ల విస్కీ, 37 లీటర్ల బీరు స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విప్లవరెడ్డి తెలిపారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌రెడ్డి, సిబ్బంది రమేశ్, సిద్ధార్థ, సునీత పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన కటికె రసూల్‌బీ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం మృతురాలి కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేశ్ పరామర్శించి.. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మల్లేశ్, జానయ్యగౌడ్, బుచ్చయ్య, అహ్మద్ ఉన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గతనెల ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియలో ఖాళీ అయిన లెఫ్ట్ ఓవర్ పోస్టులకు దసరా సెలవుల్లో కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయాలని కోరుతూ గురువారం టీపీఆర్టీయూ ఆధ్వర్యంలో విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రత్నాకర్‌రావు, చంద్రశేఖర్‌రావు, శ్యాంబాబు, భూపతిసింగ్ పాల్గొన్నారు.

మానసిక దృఢత్వం అవసరం



మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాకారులు మానసికంగా దృఢంగా ఉండాలని అంతర్జాతీయ హిప్నో కోచ్ నిజాం తొండూరు అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు 'స్పోర్ట్స్ హిప్నోసిస్ సెషన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫుట్‌బాల్ క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. మనసును నియంత్రణలో ఉంచుకొని, నెగిటివ్ ఆలోచనలను దూరం చేయాలన్నారు. మ్యాచ్ ఆడేటప్పుడు ఉత్తమ ప్రదర్శన కనబరిచేలా మెళకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి కేఎస్ నాగేశ్వర్, నందకిశోర్, రామకృష్ణ, మొయిన్, రాములు, ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ నికేశ్ పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌ఓసీ



అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మునగల యేసేపు అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2.50లక్షల ఎల్‌ఓసీని గురువారం హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, రాములు, పరశురాములు, బుచ్చన్నయాదవ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

పదవి నుంచి తొలగించాలి



మహబూబ్‌నగర్ రూరల్: దళిత, ముస్లింల మధ్య చిచ్చుపెడుతున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను పదవి నుంచి తొలగించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాభవన్ పరిరక్షణ కమిటీ (జేఏసీ) ఉమ్మడి జిల్లా దళిత బహుజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వారు సమావేశమై ఏకాభిప్రాయంతో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ కళాభవన్ ఆవరణలో రూ. 15కోట్లతో ముస్లిం విద్యార్థులకు శిక్షణ కేంద్రాలు, హజ్‌కు వెళ్లే వారికి విశ్రాంతి భవనాలు, మసీదు నిర్మించాలని నిర్ణయాలు తీసుకుంటూ.. దళిత, ముస్లింల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ప్రతినిధులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, రమేశ్, గడ్డమీది గోపాలకృష్ణ, గట్టు రాముడు, భగవంతుడు, సాయిలు, ఎర్ర నర్సింహ, యాంకి రమేశ్, నరేందర్, రాజగాని అశోక్, తరంగి లక్ష్మీకాంత్, కె.కొండన్న, పి.యాదగిరి, నర్సింహులు ఉన్నారు.

గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని బీఆర్‌ఎస్‌వీ పీయూ కన్వీనర్ రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం పీయూ గేటు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్ష నిర్వహణలో అనేక వైఫల్యాలు ఉన్నాయన్నారు. ఇందుకు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రాజు, దిలీప్, చెన్నయ్య, వినోద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో గురువారం వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ మాట్లాడుతూ.. సబ్జెక్టు టీచర్ల మాదిరిగానే తమకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా తాము చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలతో కాలానుగుణంగా మారుతున్న క్రీడా నైపుణ్యాలు, నియమ నిబంధనలు, శిక్షణలో మార్పులు వంటి అంశాలను చర్చించడానికి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు శారదాబాయి, వడెన్న, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.